సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం, 29, నవంబర్, 2023



రక్తహీనత నివారణపై దృష్టి

జిల్లాలోని పిల్లలు, గర్భిణులలో రక్తహీనత సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 8లో



క్రీడాకారులకు తోడ్పాటు

క్రీడా నైపుణ్యం ఉన్నా రాణించలేని వారికి ఆర్థిక తోడ్పాటు అందిస్తామని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. 8లో



ఆర్జిత సేవలు పునరుద్ధరణ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి ఆర్జిత సేవలను మంగళవారం నుంచి పునరుద్ధరించారు.

న్యూస్‌రీల్

జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం

- కలెక్టర్ సుమిత్‌కుమార్



జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: దేశానికి మహాత్మా జ్యోతిరావు పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు బడుగు,బలహీనవర్గాల అభ్యున్నతి, మహిళోద్ధరణకు కృషి చేశారన్నారు. డీఆర్వో అంబేడ్కర్, డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఎస్‌డీసీ మురళీకృష్ణ, తహసీల్దార్ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయం తనిఖీ



విద్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం : మండలంలోని కొత్తాడ కస్తూర్బా విద్యాలయాన్ని ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు తనిఖీ చేశారు. మంగళవారం ఆయన బాలికావిద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. అందుతున్న సౌకర్యాలను వారినుంచి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పాఠ్యాంశాలు సిలబస్ విద్యాబోధనపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ప్రత్యేకాధికారి కె.పద్మావతి, సీఆర్పీ వర ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



ఏకలవ్య పాఠశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె బాలారంలో రూ.32 కోట్లతో నిర్మించనున్న ఏకలవ్యపాఠశాల భవనాలకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యమిచ్చి ప్రభుత్వం సంస్కరణలు చేపట్టిందన్నారు. నిరక్షరాస్యులు లేని రాష్ట్రంగా చూడాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. ప్రతీ ఒక్కరు అక్షరాస్యులుగా మారితేనే ఆర్థిక ప్రగతి సాధ్యమన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తయారు చేశామన్నారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి



రికార్డులను పరిశీలిస్తున్న శోభారాణి

అరకులోయ టౌన్: విద్యాప్రమాణాలు మెరుగుపడేలా బోధన అందించాలని ప్రాంతీయ కళాశాల విద్య సంచాలకురాలు డాక్టర్ శోభరాణి ఆదేశించారు. మంగళవారం ఆమె స్థానిక ప్రభుత్వ మహిళ, బాలుర కళాశాలను సందర్శించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.కళాశాలలో అవసరమైన అతిథి అధ్యాపకుల నియామకంలో స్థానికులకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధన లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల బాలుర,మహిళ కళాశాల ప్రిన్సిపాళ్లు భరత్‌కుమార్‌నాయక్, రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చలపతిరావు పాల్గొన్నారు.

కుంకుమ పరిమళం

విదేశీ పంటలకు ఆతిథ్యమిస్తున్న చింతపల్లి ప్రాంతంలో శీతల వాతావరణంలో మాత్రమే సాగయ్యే సుగంధ జాతి పంట త్వరలో పరిచయం కానుంది. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన కుంకుమ పువ్వు సాగు పరిశోధనలు విజయవంతమయ్యాయి. మరో రెండేళ్ల పరిశోధనల అనంతరం దిగుబడి ఆధారంగా రైతులకు పరిచయం చేస్తామని ఏడీఆర్ డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు.



కుంకుమ పువ్వు దుంపలను నాటుతున్న వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు

- చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రయోగాత్మకంగా సాగు
- షేడ్ నెట్, గ్లాస్ హౌస్‌లో ఆశాజనకంగా పూత
- మరో రెండేళ్లు పరిశోధనలు
- దిగుబడి ఆధారంగా రైతులకు పరిచయం : ఏడీఆర్ డాక్టర్ సురేష్‌కుమార్



చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో కుంకుమ పువ్వు సాగు



కుంకుమ పువ్వు, రేకలు

చింతపల్లి రూరల్: కుంకుమ పువ్వు సాగుకు గిరిజన ప్రాంత వాతావరణం అనుకూలమని ప్రయోగాత్మకంగా రుజువైంది. కశ్మీర్‌లో మాత్రమే విస్తారంగా పండించే ఈ పంట గిరిజన ప్రాంతంలో సాగు చేసేందుకు అనువుగా ఉంటుందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు వెల్లడించారు. మరో రెండేళ్ల పరిశోధనల అనంతరం దిగుబడుల ఆధారంగా రైతులకు పరిచయం చేస్తామని వారు పేర్కొన్నారు.

కశ్మీర్ నుంచి విత్తనాలు దిగుమతి

కుంకుమ పువ్వు విత్తనాలను కశ్మీర్ నుంచి దిగుమతి చేసుకున్నారు. రెండు వందల కిలోల విత్తనం (దుంపలు)రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశారు. 20 సెంట్ల విస్తీర్ణంలో ప్రయోగం చేపట్టారు.

పెంపకందారు అనుభవాలతో..

- డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.ఎల్.ప్రశాంతి సూచనల మేరకు మదనపల్లెకు చెందిన ప్రముఖ కుంకుమపువ్వు పెంపకందారు శ్రీమతి శ్రీనిధి స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సందర్శించారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులను పరిశీలించారు. ఏడీఆర్ డాక్టర్ సురేష్ కుమార్, సేద్య విభాగం శాస్త్రవేత్త బీఎస్ సందీప్ నాయక్, శాస్త్రవేత్త, హార్టికల్చర్ రిసెర్చ్ అసోసియేట్ డాక్టర్ సుద్దాల వంశీ కృష్ణ పెంపకందారు అనుభవాలను తెలుసుకుని సాగు ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు.
- షెడ్యూల్ ప్రకారం ఆగస్టు, సెప్టెంబర్ మరియు అక్టోబర్ నెలల్లో మొత్తం 6,500 దుంపలను విత్తారు. ఈ మూడు పరిస్థితుల్లో గ్లాస్ హౌస్, షేడ్ నెట్‌లో అధిక మొలక శాతం రాగా బహిరంగ మైదానంలో పేలవమైన మొలక శాతం కనిపించింది.
- ఆగస్టు, సెప్టెంబర్‌లో షేడ్ నెట్‌లో విత్తిన దుంపలు పుష్పించాయి. గ్లాస్‌హౌస్‌లో నాటిన పంట పూతకు సిద్ధంగా ఉంది. వీటిలో ఆగస్టులో విత్తిన పంటకు మొదటి పువ్వు వికసించేందుకు 87 రోజులు పట్టింది. సెప్టెంబరులో విత్తిన పంటకు మొదటి పువ్వు వికసించేందుకు 56 రోజులు పట్టింది.

సమశీతోష్ణ పొడి వాతావరణంలో..

కుంకుమపువ్వు సాగు సగటు సముద్ర మట్టానికి 1500–2800 మీటర్ల ఎత్తులో సమశీతోష్ణ పొడి వాతావరణంలో బాగా వృద్ధి చెందుతుంది. పుష్పించే మరియు దుంప అభివృద్ధికి అనుకూలమైన ఉష్ణోగ్రత 23–27 డిగ్రీల సెంటీగ్రేడ్ పరిధిలో ఉంటుంది. పువ్వుల ఆవిర్భావానికి 17 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత అవసరం.

- మొక్కల మధ్య దూరం దిగుబడి, దుంప ఉత్పత్తి రెండింటినీ ప్రభావితం చేస్తుంది. 20 గీ 10 సెంటీమీటర్ల దూరం పెద్ద సైజు దుంపల ఉత్పత్తికి అనువైనదని స్థానిక పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.



పెంపకందారు శ్రీనిధి అనుభవాలు తెలుసుకుంటున్న ఏడీఆర్ సురేష్‌కుమార్, శాస్త్రవేత్తలు సందీప్ నాయక్, వంశీకృష్ణ

గ్లాస్ హౌస్‌లో మంచి దిగుబడి



ప్రయోగాత్మకంగా పరిశోధన స్థానంలో ఈఏడాది చేపట్టిన కుంకుమ పువ్వు సాగు విజయవంతమైంది. మూడు భిన్న వాతావరణ పరిస్థితుల మధ్య ప్రయోగాలు చేపట్టగా షేడ్ నెట్, గ్లాస్ హౌస్‌లో దిగుబడి బాగుంది. మరో రెండు సంవత్సరాలు పరిశోధనల అనంతరం రైతులకు పరిచయం చేస్తాం. ఈ సాగు ద్వారా రైతులు మంచి ఆదాయం పొందవచ్చు. ఆదివాసీల ఆర్థిక ప్రగతికి దోహద పడుతుందని భావిస్తున్నాం.

– డాక్టర్ ఎం.సురేష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం.

చింతూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



చింతూరులో సబ్‌స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్, ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

- వర్చువల్ విధానంలో ప్రజలకు అంకితం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- విలీన మండలాల్లో ప్రజలకు తప్పిన ఇక్కట్లు

చింతూరు: ముంపు మండలాల ప్రజల విద్యుత్ కష్టాలు తీర్చేందుకే చింతూరులో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వచ్చింది.రూ 39.93 కోట్లతో నిర్మించిన 220/33 కేవీ ఈ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తాడేపల్లి నుంచి వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు.

మాట నిలబెట్టుకున్న సీఎం

గతేడాది వరద ముంపు ప్రాంతాల సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ లేక చీకటిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వెనువెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ ప్రారంభం సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపడతామని ఇక్కడి ప్రజలకు ముఖ్యమంత్రి మాట ఇచ్చారని అందుకు తగ్గట్టుగానే విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించారన్నారు. దీని వల్ల చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల ప్రజలకు కష్టాలు తప్పాయన్నారు. ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీలు మేడేపల్లి సుధాకర్, యడమ అర్జున్, ఎంపీటీసీ సభ్యురాలు తుర్రం ముత్తమ్మ, కో ఆప్షన్ మెంబర్ అక్బర్‌అలీ, సర్పంచ్ కారం కన్నారావు పాల్గొన్నారు.

మన్యం అభివృద్ధికి సహకరించాలి

ఐటీడీఏ ఏపీవో శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఏపీవో శ్రీనివాసరావు

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు ముందుకు వచ్చి సహకరించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన పుల్లల పొయ్యిల వినియోగం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఒకొక్కటి రూ.మూడు వేల విలువైన సుమారు లక్షమేర పుల్లల పొయ్యిలను ఉచితంగా పంపిణీకి ముందుకు వచ్చిన ప్రైవేట్ కంపెనీని ఆయన అభినందించారు. క్రాప్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ సాయిబాబా మాట్లాడుతూ పుల్లల పొయ్యి ఏడేళ్ల పనిచేస్తుందన్నారు. ఆ తరువాత కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. గ్యాస్ కనెక్షన్లు లేని వారికి మాత్రమే వీటిని ఇస్తామన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్, గొడౌన్ ఇన్‌చార్జి అచ్చారావు, రంప సర్పంచ్ సీహెచ్ శ్రీదేవి పాల్గొన్నారు.

దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: భద్రతాపరమైన పనుల వల్ల కొత్తవలస–కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు.

- విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి డిసెంబరు 4వ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖచేరుకుంటుంది.
- విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 29 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు ఈ నెల 30 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

పథకాల అమలులో అలసత్వం వద్దు



దిశ సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎంపీ మాధవి, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున



వర్చువల్ సమావేశానికి హాజరైన అల్లూరి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, అధికారులు

- గైర్హాజరైన అధికారులపై చర్యలు తప్పవు
- దిశ అధ్యక్షురాలు, అరకు ఎంపీ మాధవి

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో పక్కాగా కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, ఇందులో ఎటువంటి అలసత్వం చూపొద్దని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) అధ్యక్షురాలు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి ఆమె శాఖల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి సమీక్ష సమావేశాలకు జిల్లా అధికారులంతా తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రతీ మూడు నెలలకు ఓసారి సమీక్ష నిర్వహిస్తామని, వచ్చే సమావేశానికి అధికారులందరూ పూర్తి సమాచారంతో హాజరు కావాలని స్పష్టం చేశారు. తొలుత అటవీ, దివ్యాంగుల సంక్షేమం, నీటి పారుదల, ఐసీడీఎస్, జీవీఎంసీ, సమగ్ర శిక్ష, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, పౌర సరఫరాలు, డీఆర్‌డీఏ, డ్వామా, ఏపీఈపీడీసీఎల్ తదితర శాఖలపై సమీక్షించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేసి.. లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఆరోగ్య శ్రీ ట్రస్ట్ రిఫరల్ ఆస్పత్రుల వివరాలు అందరికీ తెలియజేయాల న్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటికి అనుబంధంగా కొనసాగుతున్న రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష జరిగిందన్నారు. దిశ అధ్యక్షురాలి ఆదేశాలు, సూచనలు తప్పక పాటించాలని, వచ్చే సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరు కావాలని అధికారులకు స్పష్టం చేశారు. జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, డ్వామా పీడీ ఇ.సందీప్, జిల్లా అటవీ శాఖాధికారి అనంత్ శంకర్, గనుల శాఖ ఉప సంచాలకుడు రాజు, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ రవీంద్ర, వ్యవసాయం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

డుమ్మా కొట్టిన అధికారులపై ఆగ్రహం

సమీక్షకు జాతీయ రహదారులు, బీఎస్‌ఎన్‌ఎల్, రైల్వే అధికారులెవరూ హాజరు కాలేదు. పర్యటక శాఖ జిల్లా అధికారి రాలేదు. పలు శాఖల అధికారులు హాజరు కాకుండా కింది స్థాయి అధికారులు హాజరవ్వడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. డుమ్మా కొట్టిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వారికి నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో అనుమతి పొంది, బాధ్యత గల అధికారులను పంపాలని సూచించారు.

వర్చువల్ విధానంలో సమీక్ష


పాడేరు: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని దిశ అధ్యక్షురాలు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ఆదేశించారు. మంగళవారం ఆమె విశాఖపట్నం నుంచి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

ఏవోబీలో అప్రమత్తం

- వచ్చే నెల 2నుంచి పీఎల్‌జీఏ వారోత్సవాలు
- భగ్నం చేసే లక్ష్యంగా ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల పోలీసు బలగాలు
- గాలింపు చర్యలు ముమ్మరం
- మావోయిస్టుల ప్రభావం లేదు: ఎస్పీ తుహిన్ సిన్హా



జి.మాడుగుల మండలం మారుమూల కొండలపై గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసు బలగాలు



ఏవోబీలో పోలీసుల డేగ కన్ను

సాక్షి,పాడేరు: మావోయిస్టు పార్టీ వచ్చే నెల రెండు నుంచి 8వ తేదీ వరకు పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో మావోయిస్టుల ప్రభావం ఏమాత్రం లేకపోయినప్పటికీ ముందస్తు చర్యలు చేపట్టింది. అల్లూరి సీతారామరాజు జిల్లాగా ఏర్పాటైన నాటి నుంచి ఏవోబీలోని మావోయిస్టు పార్టీకి ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి.

అభివృద్ధి నినాదంతో ప్రభుత్వాలు

అభివృద్ధి నినాదంతో కేంద్రం, ఒడిశా, ఆంధ్రా ప్రభుత్వాలు దూసుకుపోతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో సైతం రవాణా వ్యవస్థ మెరుగుపడింది. గ్రామాల్లో కనీస అవసరాలు, మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు,సెల్‌టవర్లు పెద్ద ఎత్తున ఏర్పాటుతో కమ్యూనికేషన్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. గిరిజనులు కూడా అభివృద్ధిని స్వాగతిస్తుండటంతో మావోయిస్టుల ఉద్యమానికి ఆదరణ తగ్గింది. గతంలో చోటుచేసుకున్న పలు ఎన్‌కౌంటర్లలో మావోయిస్టుల మరణాలు, అరెస్టులతోపాటు లొంగుబాట్లు ఎక్కువగా ఉండటంతో వారి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.ఈ పరిస్థితుల్లో పీఎల్‌జీఏ వారోత్సవాలను భగ్నం చేసే లక్ష్యంగా ఇరురాష్ట్రాల పోలీసు బలగాలు ఏవోబీవ్యాప్తంగా మోహరించాయి. గ్రేహౌండ్స్, కేప్ బలగాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి.

హిట్‌లిస్టు నేతలకు నోటీసులు

జిల్లాలోని మారేడుమిల్లి, వై.రామవరం, చింతూరు అటవీ ప్రాంతాలతో పాటు, జీకేవీధి, కొయ్యూరు, చింతపల్లి, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, అరకు మండలాల్లో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. జిల్లా పోలీసు యంత్రాంగం రెడ్ అలెర్ట్‌ను అమలుచేస్తోంది. మావోయిస్టుల హిట్ లిస్టులో ఉన్న పలు పార్టీల నేతలకు కూడా పోలీసులు నోటీసులు జారీ చేసే పనిలో నిమగ్నమయ్యారు.వారోత్సవాలు ముగిసేంతవరకు నేతలంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండటమే కాకుండా మారుమూల ప్రాంతాల పర్యటనలను రద్దు చేసుకోవాలని సూచించనున్నారు.

వారోత్సవాలను అడ్డుకుంటాం




మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వారోత్సవాలను ఏవోబీ వ్యాప్తంగా అడ్డుకుంటాం. ఇప్పటికే ఏవోబీలో పోలీసుశాఖ మావోయిస్టు పార్టీ కార్యకలపాల నిరోధమే లక్ష్యంగా పనిచేస్తోంది. పోలీసు బలగాలు, బాంబు స్క్వాడ్‌లతో గాలింపు చర్యలను ముమ్మరం చేశాం. డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేశాం. ఏవోబీలో మావోయిస్టుల ప్రాబల్యం పూర్తిగా తగ్గింది. అయినప్పటికీ అప్రమత్తంగానే వ్యవహరిస్తున్నాం. మారుమూల ప్రాంతాల అభివృద్ధి, ప్రశాంత వాతావరణం, శాంతి భద్రతల లక్ష్యంతో పనిచేస్తున్నాం.

– తుహిన్‌సిన్హా, ఎస్పీ, పాడేరు

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే





సమావేశానికి హాజరైన సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు–నేడు ఫేజ్–2బి ద్వారా మౌలిక వసతులు కల్పిస్తామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవోలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. నాడు–నేడు ఫేజ్– 2బి ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు, భవనానికి రంగులు వేయడం జరుగుతుందన్నారు.ఫేజ్–2బిలో పనులు చేపట్టేందుకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన తల్లుల కమిటీలతో తీర్మానాలు చేయాలన్నారు. బ్యాంక్ ఖాతా తెరవాలన్నారు. అన్ని అగ్రిమెంట్లు తీర్మానాలు చేసిన వెంటనే అప్లోడ్ చేయాలని పీవో సూచించారు. అప్లోడ్ చేసిన తర్వాత అకౌంట్‌ల్లోకి నిధులు వస్తాయన్నారు.నాడు–నేడు ద్వారా చేపట్టే పనులను సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. రంపచోడవరం మండలంలో 76, దేవీపట్నం మండలంలో 38, మారేడుమిల్లి మండలంలో 22, గంగవరం మండలంలో 17,అడ్డతీగల మండలంలో 58, రాజవొమ్మంగి మండలంలో 65, వై. రామవరం మండలంలో 43 కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.సీడీపీవోలు సంధ్యారాణి, ప్రసన్నలక్ష్మి, విజయగౌరి, జిల్లా రిసోర్స్ పర్సన్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పచ్చకామెర్ల లక్షణాలతో చిన్నారి మృతి



చిన్నారి మృతదేహం

జి.మాడుగుల: మండలంలో పెదలువ్వాసింగి గ్రామంలో రెండేళ్ల బాలుడు కొద్దిరోజులుగా పచ్చకామెర్ల లక్షణాలతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. సాగేని సత్తిబాబు, సూర్యకాంతంకు చెందిన బాలుడు టోనివర్దన్ పచ్చకామెర్ల లక్షణాలతో బాధపడుతుండటంతో స్థానిక పీహెచ్‌సీకి సోమవారం సాయంత్రం తీసుకువచ్చారు. వెంటనే పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు.

క్లుప్తంగా

అసభ్యకర కాల్స్, మెసేజ్‌లపై ఫిర్యాదు

చింతూరు: తమ ఫోన్లకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి అసభ్యకర కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయని కొంతమంది అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు మంగళవారం చింతూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు నంబర్లు ఇచ్చారంటూ అసభ్యకరంగా మాట్లాడటంతో పాటు అసభ్యకర ఫొటోలు, మెసేజ్‌లు పంపుతున్నారని వాపోయారు. గర్భిణులకు ఫోన్లు చేసి ఓటీపీలు అడుగుతున్నారని, దీనిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్యతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలి పర్యటన

సాక్షి,పాడేరు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి బుధవారం పాడేరులో పర్యటించనున్నారు. తొలిసారిగా ఇక్కడకు వస్తున్న ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటలకు మోదకొండమ్మ తల్లిని దర్శించుకుని, అనంతరం పాడేరు మెడికల్ కళాశాలను సందర్శిస్తారని పార్టీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు తెలిపారు. తదుపరి జిల్లా బూత్ కమిటీలతోను, జిల్లా నేతలతోను వేర్వేరుగా సమావేశం కానున్నారన్నారు.

పాముకాటుతో వృద్ధుడి మృతి



మృతిచెందిన ముత్తయ్య

చింతూరు: మండలంలోని తెరపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తుర్రం ముత్తయ్య(60) పాముకాటుతో మంగళవారం మృతిచెందాడు. సోమవారం అతడు పాముకాటుకు గురయ్యాడు. వెంటనే భద్రాచలం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, సర్పంచ్ కారం కన్నారావు, వార్డు మెంబర్ కారం సాయిబాబు, మడివి రాజు అతని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

177 మందికి డీకేటీ పట్టాల పంపిణీ



అసైన్‌మెంట్ భూముల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎటపాక: ఏజెన్సీలోని గిరిజనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలో 344 ఎకరాల అసైన్‌మెంట్(డీకేటీ) భూములకు సంబంధించి మంగళవారం లక్ష్మీపురం పంచాయతీ లింగాలపల్లిలో 177 మంది గిరిజనులకు హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత పాలకుల నిర్వాకంతో పేదలు అన్ని రంగాల్లో వెనుకబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారని వాపోయారు. జగనన్న నాలుగేళ్ల పాలనలో పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా పేదలే అర్హతగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటికి వేల రూపాయలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. దాంతో తాము ఇది చేశామని ధైర్యంగా చెబుతున్నామని, గత పాలకులు ఏమి చేసారో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. విద్య, వైద్యం పేదవాడికి ఉచితంగా అందించి వారి కుటుంబాల్లో సంతోషం నింపారన్నారు. రానున్న కాలంలో ఇవే అమలు కావాలంటే మరలా మన ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాల చేరిక..

మండలంలోని గొమ్ముకొత్తగూడెం పంచాయతీలో 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీ నాయకుడు కుచ్చలపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

గడప గడపకు మన ప్రభుత్వం

లక్ష్మీపురం గ్రామ పంచాయతీ లింగాలపల్లి, బూరుగువాయి, లక్ష్మీపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వారి సమస్యలను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు తానికొండ వాసు, సచివాలయాల కన్వీనర్ గోసు ప్రశాంత్, జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, పార్టీ నేతలు రంభాల నాగేశ్వరరావు, ఆకుల వెంకటరామారావు, మంత్రిప్రగడ నర్సింహరావు, దామెర్ల రేవతి, కురినాల వెంకట్, కిరణ్, చిన్ని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

12న హుకుంపేటలో సామాజిక సాధికార యాత్ర

విజయవంతం చేయాలన్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, అరకు ఎమ్మెల్యే పాల్గుణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాని ప్రభుత్వం సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ముంచంగిపుట్టులో మంగళవారం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి, మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లే సదుద్దేశంతో సామాజిక సాధికార యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదల జీవన ప్రమాణాలు మార్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలు సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు అన్ని వర్గాల వారికి తీవ్ర అన్యాయం చేస్తే, ఎన్నికల హామీలు అమలు చేస్తూ కుల, మతాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా జగనన్న ప్రభుత్వం పని చేసిందన్నారు. వచ్చే నెల 12న హుకుంపేటలో నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను పార్టీ శ్రేణులు, అభిమానులు, అన్ని వర్గాల ప్రజాలు విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, పార్టీ మండలాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై దృష్టి

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: జిల్లాలోని పిల్లలు, గర్భిణులలో రక్తహీనత సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించి వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఎంపీడీవోలు, సీడీపీవోలు, ఎంఈవోలతో నిర్వహించిన వీడియో సమావేశంలో పలు సూచనలు చేశారు. జిల్లాలో 39వేల మంది పిల్లలకు ఇటీవల రక్తపరీక్షలు నిర్వహించగా, 25వేలకు పైగా పిల్లలు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారన్నారు. వీరిలో 538 మందిలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉందన్నారు. వీరిపట్ల ప్రత్యేక దృష్టి సారించి ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేయడమే కాకుండా సక్రమంగా వాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్తహీనత సమస్య అధికంగా ఉన్న గర్భిణులపై ఐసీడీఎస్ సిబ్బంది ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. టేక్ హోంరేషన్‌ను పక్కాగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలనిఆదేశించారు. సీడీపీవోలంతా టేక్ హోంరేషన్‌ను పర్యవేక్షించాలన్నారు.ఎంపీడీవోలంతా గ్రామసచివాలయాల వారీగా సమీక్షలు జరిపి, గర్భిణులకు ఆస్పత్రిలో కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏ పీవోలు కంటి వెలుగు శస్త్రచికిత్సలను పర్యవేక్షించాలని సూచించారు. విధులకు హాజరుకాని వైద్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదిరోజులుగా విధులకు హాజరుకాని వైద్యాధికారులను గుర్తించి, వారిని ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్,సూరజ్ గనోరే, చైతన్య, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ తమర్భ విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు.

క్రీడాకారులకు తోడ్పాటు

- ఐటీడీఏ పీవో కావూరి చైతన్య
- వెయిట్ లిఫ్టింగ్ పోటీల విజేతకు మధుచందనకు సత్కారం

చింతూరు: క్రీడా నైపుణ్యం ఉన్నా సరైన అవకాశాలు లేక ఎంతోమంది యువత తమ ప్రతిభ చూపలేక పోతున్నారని అలాంటి వారికి ఐటీడీఏ ద్వారా ఆర్థిక తోడ్పాటు అందిస్తామని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. ఇటీవల రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన స్థానిక కేజీబీవీ విద్యార్థిని గుత్తుల మధుచందనను మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ జాతీయస్థాయిలో రాణించడం ద్వారా జిల్లాతో పాటు చింతూరు డివిజన్‌కు మంచిపేరు తేవాలని కోరారు. ఎన్నో అడ్డంకులను అధిగమించి కోచ్ గంగాధర్ సారథ్యంలో అందివచ్చిన అవకాశాలను మధుచందన చక్కగా వినియోగించుకుంటూ పతకాలు సాధించడం హర్షణీయమన్నారు. రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించడమే కాకుండా జాతీయస్థాయి పోటీ లకు ఎంపిక కావడం వెనుక కోచ్ గంగాధర్ కృషి ఎంతోవుందన్నారు.

సారాతో పట్టుబడితే పీడీ యాక్ట్

రాజవొమ్మంగి: పదే పదే సారా కేసుల్లో పట్టుబడితే అటువంటి వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని సీఐ షేక్ బాజిలాల్ హెచ్చరించారు. మండల సరిహద్దు అటవీ ప్రాంతంలో బోయపాడుకు సమీపాన సారా బట్టీపై మంగళవారం ఆయన ఎస్సై వెంకయ్య, సిబ్బందితో కలసి దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. బట్టి ధ్వంసం చేసి సామగ్రిని, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 800 లీటర్ల బెల్లం పులుపును పారబోశారు.

త్వరలో జిల్లా మహాసభలు

చింతూరు: ఆదివాసీ టీచర్ల అసోసియేషన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యామల సుబ్బయ్య కోరారు. మంగళవారం చింతూరు ఆయన మాట్లాడుతూ త్వరలో ఎటపాక మండలం నల్లకుంటలో ఈ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఆదివాసీ చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రవి, వినోద్, మధు, రత్తయ్య పాల్గొన్నారు.

గ్రూప్స్ శిక్షణ ఎంపికకు 3న రాత పరీక్ష



ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: సివిల్ సర్వీసెస్, గ్రూప్-1,2 ఉద్యోగాల శిక్షణకు నిర్వహించిన మొదటి లెవెల్‌లో ఉత్తీర్ణులైన వారికి డిసెంబర్ 3న రెండో లెవెల్ పరీక్ష నిర్వహించనున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మొదటి లెవెల్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారి వివరాలను రంపచోడవరం ఐటీడీఏ, వైటీసీ, చింతూరు ఐటీడీఏ, వైటీసీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఉచిత శిక్షణకు 449 మంది దరఖాస్తు చేయగా ఇందులో 422మంది అభ్యర్థులు మొదటి లెవెల్ పరీక్షకు హాజరయ్యారన్నారు. వీరిలో 150 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. రెండో లెవెల్ పరీక్షకు సంబంధించి వైటీసీలో హాల్ టికెట్లు అందుబాటులో ఉంటయన్నారు. వీటిని ఈనెల 29 , 30 తేదీల్లో అభ్యర్థులు తీసుకోవాలని పీవో సూచించారు.

చింతూరు: సివిల్స్, గ్రూప్-1,2 శిక్షణ నిమిత్తం రెండోదశకు చింతూరు ఐటీడీఏ నుంచి 51 మంది అర్హత సాధించినట్లు పీవో కావూరి చైతన్య తెలిపారు. ఈనెల 26న నిర్వహించిన తొలిదశ స్క్రీనింగ్ పరీక్ష ఫలితాలను ఆయన మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ నుంచి 153 మంది దరఖాస్తు చేసుకోగా 145 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. వీరిలో 51 మంది రెండోదశ స్క్రీనింగ్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. అర్హుల జాబితాను ఐటీడీఏ కార్యాలయంతో పాటు ఆయా మండలాల తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల నోటీసుబోర్డులో ఉంచినట్టు తెలిపారు.

సరిహద్దు భూ వివాదంపై ఉమ్మడి సర్వే



సింగవరంలో సర్వే చేస్తున్న రెవెన్యూ, ఫారెస్ట్ శాఖ అధికారులు

అనంతగిరి: మండలంలోని గరుగుబిల్లి పంచాయతీ సింగవరం రెవెన్యూ పరిధిలో పూతికవలస, సింగవరం గ్రామాల గిరిజనులు సాగు భూముల్లో సరిహద్దు వివాదం నెలకొంది. దీనిపై జిల్లా సర్వేయర్ మోహన్‌రావు, తహసీల్దార్ రాంబాయి, ఫారెస్ట్ రేంజర్ దుర్గాప్రసాద్‌తో కలిసి మంగళవారం ఉమ్మడి సర్వే చేపట్టారు. రెవెన్యూ, ఫారెస్ట్ రికార్డులను జిల్లా సర్వేయర్ క్షుణంగా పరిశీలించి, సర్వే నిర్వహించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని, సరిహద్దు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించి గిరిజనులకు న్యాయం చేయాలని జెడ్పీటీసీ గంగరాజు కోరారు. కార్యక్రమంలోని ఎంపీటీసీ తౌటినాయుడు, మాజీ సర్పంచ్ సింహాచలం, మండల సర్వేయర్ తేజశ్వరరావు, వీఆర్వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో సత్తా చాటాలి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- గ్రామసచివాలయాకు క్రీడా పరికరాల పంపిణీ



సచివాలయాల సిబ్బందికి క్రీడాకిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో జిల్లా యువత సత్తా చాటాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కరపత్రాలు, లోగోలను ఆయన ఆవిష్కరించారు. సచివాలయాలకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో పోటీలు జరుగుతాయన్నారు. గ్రామ, మండల స్థాయి పోటీల్లో విజేతలకు ధ్రువపత్రాలు, ట్రోఫీలు అందిస్తామన్నారు. జిల్లా,రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలకు నగదు బహుమతులు పంపిణీ చేస్తామన్నారు.ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి 15ఏళ్లు నిండిన యువత దగ్గరలోని గ్రామసచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.ఆన్‌లైన్‌తో పాటు 1092 నంబర్‌కు కాల్ చేసి కూడా ఈ పోటీలకు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఎస్‌డీసీ మురళీ, జిల్లా క్రీడాధికారి జగన్మోహన రావు, ఎంపీడీవో నవీన్, ఎస్‌డీఎఫ్ కార్యదర్శి సూరిబాబు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ




విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

చింతూరు: విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ అప్పలనాయుడు తెలిపారు. పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, ఉత్తమ క్రమశిక్షణ వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. అనంతరం వ్యసనాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌ఐ శ్రీనివాస్, ఎస్ఈబీ ఎస్ఐ వంశీకృష్ణ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనే లక్ష్యం

గూడెంకొత్తవీధి: మన్యంలో గంజాయి సాగు, అక్రమ రవాణా నిరోధమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఏకలవ్య మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదన్నారు. దీనివల్ల తలెత్తే అనర్థాలపై గ్రామాల్లో తల్లిదండ్రులకూ అవగాహన కలిగించాలన్నారు. ఎక్సైజ్ సీఐ రాజు, ప్రిన్సిపాల్ రమణ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనకంగా వరి పంట దిగుబడి



బడదనాంపల్లిలో పంట కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయాధికారులు

రాజవొమ్మంగి: ఖరీఫ్ వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని ఏవో రమేష్‌నాయుడు తెలిపారు. మంగళవారం బడదనాంపల్లిలోని పొలాల్లో రైతుల సమక్షంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఎకరాకు 27 బస్తాల (75 కిలోల చొప్పున) దిగుబడి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. మండలంలో ఎకరాకు సరాసరిన 25 బస్తాల దిగుబడి అంచనా వేస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా 4,800 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగయ్యిందన్నారు. ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభమయ్యాయన్నారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు అడ్లబోయిన శివకుమార్, ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ ఏజెంట్ మోహన్ పాల్గొన్నారు.